# 16. అసూయ

విశ్వ ప్రయత్నాలు చేసినా యూనివర్శిటీ హాస్టల్ గదిలోని దోమలను చంపలేక పోగా, అవి రోజురోజుకూ బలుస్తుంటే — విసుగుచెందకుండా వాట్ని చంపడానికి ప్రయత్నించే పి.జి విద్యార్థిలా చెట్టుదగ్గరికెళ్ళాడు శేషగిరి—చెట్టెక్కి పైకొమ్మపైవున్న శవాన్ని భుజంపై వేసుకున్నాడు — జాగ్రత్త పడుతూ చెట్టుదిగి శ్మశానం దిక్కు వడివడిగా నడుస్తున్నాడు — అతన్ని మాట్లాడించాలని శవంలోని భేతాళుడు—

'మానవా! నీ పండినతల, ముడతలుపడ్డ ముఖంచూస్తుంటే ఎన్నో జీవితానుభవాలను జీర్ణించుకున్నవాడిలా కనబడుతున్నావు— పాలిపగలతో కొట్లాడి, కోర్టులచుట్టూ తిరిగి చిక్కిశల్యమైన వాడిలా అగుపడుతున్నావు నన్ను స్వాధీనం చేసుకోవడం నువ్వనుకున్నంత సులభంకాదు—అయినా నువ్వేంకోరి నన్ను స్వాధీనం చేసుకోవాలనుకుంటున్నావో చెప్పు—, అన్నాడు

"అవును! భూమి పంపకాల్లో ఒక్క ఎకరంభూమి దగ్గర మా అన్నదమ్ములిద్దరికి మధ్య గొడవజరిగింది—ఇద్దరం కొట్టుకున్నాం—తలలు పగులగొట్టుకున్నాం—ఊళ్ళో పెద్దమనుషులు నాదిక్కు కొందరు అన్న దిక్కు కొందరయ్యారు—ఇద్దరిమధ్య వైషమ్యాలను మరింత పెంచారు— పంచాయతీలెంతకూ పరిష్కారం కానీయలేదు— ఊళ్ళో దండుగగట్టాం పోలీసుస్టేషన్లోనూ దండుగలుగట్టాం— అందర్నీ మేపాం—కోర్టుకు పొమ్మని ఉచిత సలహాలిచ్చారు—నేనే గెలుస్తానని నాతో, మా అన్నేగెలుస్తాడనీ

అతన్తో చెప్పి పురెక్కించారు- మాలో పట్టుదలలు మరింత పెంచారు - మేము ఒకరి నాశనానొక్కరం మనస్ఫూర్తిగా కోరుకున్నాం ... కోర్టు కెళ్ళాం- ప్రతి వాయిదాకు నేనో ఇద్దర్ని అన్నో ఇద్దర్ని వెంబడేసుకొని తిరిగాం.... వాళ్ళకు తినిపించడం- తాగించడం- బస్సుకిరాయలు మొదలు కొని లాడ్జిగ్ ఖర్చులవరకన్నీ భరించడం- అటు లాయర్లను మేపడం తిరిగీ తిరిగీ అలసిపోయాం...

వాయిదాలమీద వాయిదాలు—ఎన్నేళ్ళయినా కేసు కొలిక్కిరాలేదు- ఖర్చులకోసం మా భార్యలమీదున్న బంగారమమ్మాం.... కొంత భూమిని అమ్మాం పట్టుదలలు పెరిగి మరింత నాశనాన్ని కోరుకున్నాం... ఎంత నష్టపోయినా కేసుపూర్తి కాలేదు.... మా పరిస్థితి జూచిన ఓ బుద్ధిమంతుడు ఈ తగాదా ప్రారంభమైనప్పట్నుంచి మాకయిన ఖర్చులను లెక్కజేసి చూపించాడు ... ఏ ఎకరం కోసమైతే కొట్లాడుతున్నామో ఆ ఎకరం అమ్మితే వచ్చేడబ్బు కంటే ఎన్నోరెట్లెక్కువ ఖర్చుచేశాం — అతడు విడమర్చి చెప్పేసరికీ మా కళ్ళు తెరుచుకున్నాయి — అయినా అప్పటికే చాలా ఆలశ్యమైంది... ఒకర్నొకరం జాలిగా చూచుకున్నాం ... కేసు విరమించుకున్నాం—ఆ భూమిని చెరిసగం పంచుకున్నాం కాని-అప్పటి వరకే కోలుకోనంతగా నష్టపోయాం...వ్యవసాయం దెబ్బతింది_మాకు పురెక్కించి ప్రోత్సహించినవాళ్ళే మేం చితికిపోవడంచూచి బాగాబలిసి కోర్టులవెంట తిరిగారు అన్నారు ... మొదలే అంతంత మాత్రంగావున్న బతుకులు — ఈ కేసుతో మరీ పతనమయ్యాం—ఆర్థిక ఇబ్బందులను తట్టుకోలేక ఏమార్గమూ కనబడక ఈ ప్రయత్నం చేస్తున్నాను— „

తనలో తానే గొణుకున్నట్టనుకొని గంభీరంగా ముఖంపెట్టి మౌనంగా శ్మశానం దిక్కు నడుస్తున్నాడు శేషగిరి....

"మనిషీ! నీ పట్టుదలకు సంతోషించాను...తోవ తొందరగా కరిగి పోవడానికి నీకో కథ చెబుతాను విను...అని కథ చెప్పడం ప్రారంభించాడు భేతాళుడు...

పరస్పరం ఒకర్నొకరు ద్వేషించుకుంటూ, తిట్టుకుంటూ, పోట్లాడుకుంటూ ఇంటిని కురుక్షేత్రంగా మార్చి జీవిస్తున్నారా దంపతులు .... వాళ్ళకిద్దరు కొడుకులు పుట్టారు... అయినా వాళ్ళ ప్రవర్తనలో మార్పు రాలేదు ... ఇంటి వాతావరణం పిల్లలపై ప్రభావం చూపడం సహజమే కదా? తల్లిదండ్రుల్లాగే ఆ ఇద్దరు పిల్లలూ ఒకరిపై ఒకరు నిందలు మోపుకోవడం....ఒకర్నొకరు ద్వేషించుకోవడం.... ఒకరిపనినొకరు వ్యతిరేకించడం....చిన్నప్పట్నుంచే వాళ్ళమధ్య ఎడంపెరుగుతుంది...తమలో తామే నిత్యమూకొట్లాడే తల్లిదండ్రులు పిల్లల్లో పెరుగుతున్న ద్వేషాన్ని పట్టించుకోలేదు...

పెళ్ళయింతర్వాత వాళ్ళు మరింత దూరమయ్యారు...వాళ్ళమధ్య పచ్చిగడ్డివేస్తే భగ్గునమండేంత పగ ఒకరు బాగుపడితే మరొకరు సంతోషించడానికి బదులు ద్వేషించుకొనేవారు.... ఒకర్నిమించి ఒకరు డబ్బు సంపాదించాలని ప్రయత్నించేవారు....వాళ్ళకో సాధువు కలిసి ఓ సలహా ఇచ్చాడు...వాళ్ళకోరికలు తీరాల టే తపస్సు చేయాలన్నాడు ..ఇదువరకెవ్వరూ పూజించని యమధర్మరాజు వాహనాన్ని గూర్చి స్మరించమన్నాడు...అన్నదమ్ములిద్దరూ ఊరిబయట స్థలాన్నెన్నుకొని "దున్నపోతా- దున్నపోత" అని స్మరిస్తూ కఠోరమైన తపస్సు చేయసాగారు— తన నింతవరకూ ఎవ్వరూ పార్థించడం ఎరుగని మహిషం వాళ్ళభక్తికి మెచ్చింది ...తమ యజమాన్ని వెంటబెట్టుకొచ్చింది—ఆ అన్నదమ్ముల తపస్సుకు మెచ్చానని వరాలు కోరుకొమ్మంది...

మొదటి చిన్నవాడి కవకాశమిచ్చింది...బాగా ఆలోచించాడతను – తనకు ఫలానా కావాలని అడక్కుండా అన్న ఏదికోరితే దానికి రెట్టింపు కావాలన్నాడు తెలివిగా....సరేనని పెద్దవాన్ని కోరుకొమ్మంది మహిషం– తమ్ముని కోర్కె విన్నాడు అన్న.... తానేం కోరినా తమ్మునికి రెట్టింప వుతుంది—తమ్ముడు తనకంటే గొప్పవాడవడం తాను సహించలేడు – బాగా తర్జన భర్జన చేసుకున్నాడు అన్న

కథ చెప్పడం ఆపాడు భేతాళుడు—

"అన్న ఏం వరం కోరుకొనుంటాడు—? వాళ్ళ ఈపరివర్తనకు కారాణాలేంటి—? బాధ్యులెవరు—!

ఈ ప్రశ్నలకు జవాబులు తెలిసీ చెప్పకపోయావో జాగ్రత్త—' హెచ్చరించినట్టని మౌనం వహించాడు భేతాళుడు—

ఈ భేతాళుడు భలేవాడు—మా కథలాంటిదేచెప్పి నాతో జవాబులు చెప్పించి మాయం కావాలని చూస్తున్నాడు—ఈ కథ నాకు తెలిసిందే –, తనలో తాననుకొని జవాబులు చెప్పసాగాడు శేషగిరి—

"వాళ్ళు కోరుకునేది ఒకరి నాశనాన్నొకరు కాబట్టి ఆ అన్న ఒక కాలు, ఒకచేయి, ఒకకన్ను పనిచేయకుండా ఉండాలని కోరుకొనుం టాడు — ఈ దెబ్బతో తమ్ముని మొత్తం శరీరం పనిచేయకుండా అవు తుంది—అసూయనేది మనిషిని వివేకహీనున్ని చేస్తుంది—

వాళ్ళ ప్రవర్తనకు ముఖ్యకారణం ఇంట్లో అస్తమానమూ పోట్లా డుకుంటూ బ్రతికే తల్లిదండ్రులే — తమలో తామే కొట్లాడుకుంటూ పిల్లల్లో పెరుగుతున్న అవాంచనీయ ధోరణాల్ని పట్టించుకొని తల్లిదం డ్రులే దీనికి ప్రధాన బాధ్యులు—"

శేషగిరికి మౌనభంగం కాగానే శవంతోసహా మాయమై మళ్ళీ చెట్టెక్కాడు భేతాళుడు.

[చిత్రిక వారపత్రిక జనవరి, 1987]